సాక్షి
బాపట్ల


బుధవారం । 15 । అక్టోబర్ । 2025

I



315 రోజులుగా దీక్షలు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 315వ రోజుకు చేరుకున్నాయి. శిబిరాన్ని కేసీ వర్క్స్ యూనియన్ నాయకులు సందర్శించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 74,600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 81,966 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.



టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

గుంటూరుమెడికల్: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని సుష్మగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షులు జల్లెడ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఎన్‌వీఎస్ ప్రసాద్‌గౌడ్ అందజేశారు.

న్యూస్‌రీల్

సైయిట్‌కట్ సీమౌత్ తీరంలో సర్వే

బాపట్ల టౌన్: ఈపూరుపాలెం స్రైయిట్‌కట్ సీమౌత్ ప్రాంతంలో రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. ఎల్ ఆకారంలో ఉన్న ఈపూరుపాలెం స్రైయిట్‌కట్ సీమౌత్‌ను చీరాల టీడీపీ నేత బుర్ల వెంకట్రావు, కాలువను పూడ్చి చదునుచేయటం వివాదంగా మారింది. దీనిపై స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్, తీరంలో ఆక్రమణలను తేల్చేందుకు అధికారులతో కమిటీ వేశారు. అందులో భాగంగా రెవెన్యూ, సీసీఆర్‌జెడ్, ఇరిగేషన్, పోలీస్, మత్స్యశాఖ అధికారులతో కూడిన కమిటీ తీరంలో ఈపూరుపాలెం స్రైయిట్‌కట్ సీమౌత్ వద్ద సర్వే నిర్వహించింది. ఆర్డీఓ గ్లోరియా మాట్లాడుతూ సముద్రతీర ప్రాంతాల్లోని అటవీ, రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 494–1బీ, 2బీ, 498–1సీ, 2సీ పరిధిలో రైతుల పొలాలు ఉన్నాయని పేర్కొన్నారు. సర్వే నంబర్ 499–2లో 3.42 ఎకరాలు డీకే భూమి ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, ఇరిగేషన్ ఈఈ మురళీకృష్ణ, రూరల్ సీఐ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమరేశ్వరుని హుండీ ఆదాయం



అమరావతి: అమరావతిలోని శ్రీ బాల చాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీలలోని కానుకలను లెక్కించారు. కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖరరావు సమక్షంలో 12 హుండీలను తెరచి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలల 7 రోజుల కాలానికి దేవాలయంలో ఉన్న హుండీల ఆదాయం మొత్తం రూ.20,07,999. అన్నదాన మండపంలోని హుండీ ద్వారా రూ.48, 809 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖ తెలిపారు.

19న త్రిపురనేని రామస్వామి పురస్కార ప్రదానోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సమాజంలోని గొప్ప సామాజిక విప్లవకారుడు కవిరాజు త్రిపురనేని రామస్వామి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 19న సాయంత్రం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. 2025వ సంవత్సరానికి రామస్వామి చౌదరి పురస్కారాలను సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రాజకీయ, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ మూకిరి సుధ, వీసీకే పార్టీ మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు కైలా జయసుధ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ – జాషువా – పూలే – పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.వి ల్సన్ పాల్గొన్నారు.

నేటి నుంచి కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల సమ్మె



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, జేఎల్ఎం గ్రేడ్ –2ల సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ జిల్లా చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం కమిటీ జనరల్‌బాడీ సమావేశం రామ్‌ప్రభాకర్, జి.నాగరాజుల అధ్యక్షతన జరిగింది. చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ నాగబ్రహ్మాచారి, జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని, దీనికి పూర్తిగా యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాయకులు జానీ, పవన్, రాంబాబు, వంశీ, అందే రాజేష్, కొండా, చంద్రశేఖర్ ఆచారి పాల్గొన్నారు.

జనార్దనరావు వీడియో వెనుక ప్రభుత్వ పెద్దలు



- ఆఫ్రికా నుంచి విడుదల చేసిన వీడియోలో జోగి రమేష్ ప్రస్తావన ఎందుకు లేదు
- నకిలీ మద్యంపై రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా వైఎస్సార్ సీపీపై మోపడం దుర్మార్గం
- ముందురోజు సీఎం మాటలే జనార్దనరావు వీడియో ప్రసంగం
- జనార్దనరావు ఫోను గుట్టు తేల్చండి
- సీబీఐ దర్యాప్తునకు ఎందుకు భయం!
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

ఒంగోలు సిటీ: కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం తయారు చేస్తూ, ఆధారాలతో సహా బయటపడినప్పటి నుంచి దాన్ని ఎలాగైనా వైఎస్సార్ సీపీకి అంటించేందుకు టీడీపీ పెద్దలు చేస్తున్న కుట్రలు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆరోపించారు. నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్‌కు ప్రమేయం ఉందంటూ ఆ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. దానిపై ఎల్లో మీడియా రెచ్చిపోతూ, నిన్న సాయంత్రం నుంచే ట్రోల్స్ చేస్తోందన్నారు. కేవలం వైఎస్సార్ సీపీపైనా, ఆ పార్టీ నాయకులపైనా కక్ష సాధింపులకు పాల్పడడం, కేసు నుంచి బయట పడేందుకు డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా సీఎం నారా చంద్రబాబు చేసిన కుట్ర అని దుయ్యబట్టారు. 'అసలు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అద్దేపల్లి జనార్దనరావు వీడియో ఎలా రికార్డ్ చేశాడు? పైగా తన ఫోన్ పోయిందని చెప్పినట్లు ఎల్లో మీడియాలోనే వచ్చింది. అలాగే ఏ కేసులో నిందితుడైనా, విచారణ అధికారుల ముందు ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు నిలబడి, చేతులు కట్టుకుని వినమ్రతతో మాట్లాడతారు. కానీ నిన్న జనార్దనరావు లీక్ చేసిన వీడియోలో ఆయన చక్కగా చైర్‌లో కూర్చుని ఉన్నాడు. పక్క నుంచి ఆఫీసర్ ఎవరో ప్రాంప్ట్ చేస్తున్నట్లుగా ఉంది. పైగా తను ఆఫ్రికా నుంచి వచ్చినప్పటి డ్రెస్‌తోనే ఉన్నాడు. మరి ఆ వీడియో ఎప్పుడు, ఎవరు, ఎవరి ఫోన్‌లో రికార్డు చేశారు? ఇదంతా చూస్తుంటే, ఒక పథకం ప్రకారం చేసిన కుట్ర మాదిరిగా కనిపించడం లేదా' అని వరికూటి సూటిగా ప్రశ్నించారు. అలాగే ఆ వీడియోను మీడియాకు ఎవరు విడుదల చేశారు? అన్నది తేలాలన్నారు. ఈ కేసులో వాస్తవాలను కప్పిపుచ్చుతూ కొత్త కట్టుకథ వినిపించేందుకే ఆ వీడియో విడుదల చేశారన్నది స్పష్టమవుతోందని పేర్కొన్నారు. పోలీసుల అదుపులో, జైలు అధికారుల రిమాండ్‌లో ఉన్న వ్యక్తి వీడియో లీకు కావడానికి బాధ్యత ఎవరిదని నిలదీశారు. జనార్దనరావు గత వారం ఆఫ్రికా నుంచి కూడా ఒక వీడియో రిలీజ్ చేశాడని, నకిలీ మద్యం తయారీలో పార్టీ, ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేదని, తాము మాత్రమే ఆ పని చేశామని చెప్పుకొచ్చాయడన్నారు. ఆ రోజే మరి నిజంగా జోగి రమేష్ పేరు ఎందుకు ప్రస్తావించలేదని, రమేష్ చెబితేనే తాను నకిలీ మద్యం తయారుచేసిన విషయాన్ని ఆ వీడియోలోనే ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.

చంద్రబాబుకు సన్నిహితుడే..

కేసులో ఏ–1 నిందితుడైన జనార్దనరావు చంద్రబాబుకు సన్నిహితుడేనని, 2024 ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జయచంద్రారెడ్డికి చంద్రబాబు టికెట్ ఇచ్చినప్పుడు జనార్దనరావు అక్కడే ఉన్నాడన్నారు. బీఫాం ఇచ్చేటప్పుడు అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులే ఉంటారు. మరి జనార్దనరావు ఆ సమయంలో చంద్రబాబు, జయచంద్రారెడ్డిలతో ఉండటం దేనికి సంకేతమన్నారు. ఇన్ని ఆధారాలు కనిపిస్తున్నా జనార్దనరావుకు జోగి రమేష్ సన్నిహితుడన్న ప్రభుత్వ వాదన పూర్తిగా కట్టు కథగా చెప్పారు. ఇప్పుడు జనార్దనరావు తన వీడియోలో గత ప్రభుత్వ హయాం నుంచి జోగి రమేష్ చెప్పడం వలనే నకిలీ మద్యం తయారు చేశానని చెబుతున్నారని, దానికి, దీనికి లింక్ కుదరడం లేదని పేర్కొన్నారు.

బాబు మాటలే జనార్దనరావు వీడియో..

జనార్దనరావు వీడియో సోమవారం సాయంత్రం విడుదల కాగా, అందులోని విషయాలపై ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు సూచన ప్రాయంగా వివరాలు ఎలా వెల్లడించారు! అంటే సమాచారం ఒక రోజు ముందుగానే ఆయనకు తెలుసా అని ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే.. ఇదంతా ఒక పక్కా వ్యూహం ప్రకారం విపక్ష వైఎస్సార్ సీపీపై బురద చల్లుతూ, తాము ఈ కేసు నుంచి బయట పడేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వ పెద్దలు చేస్తున్న కుట్రన్నారు.. ఒక్క మాటలో చెప్పాలంటే.. పెదబాబు, చినబాబు చేసిన కుట్ర, కుతంత్రం ఇదంతా? అది నిజం కాదని చెప్పే ధైర్యం ఆ ఇద్దరికీ ఉందా? అని ప్రశ్నించారు.

జయచంద్రారెడ్డిని ఎందుకు తీసుకురావడం లేదు..

ములకలచెరువు నకిలీ మద్యం మాఫియాలో కీలక పాత్రధారిగా ఉన్న టీడీపీ నేత జయచంద్రారెడ్డిని విదేశాల నుంచి రప్పించేందుకు పోలీసులు ఎందుకు ప్రయత్నించడం లేదు? ఆయనపై ఎందుకు ఇంకా లుక్ అవుట్ నోటీసు జారీ చేయడం లేదని వరికూటి ప్రశ్నించారు. ఆయన రాష్ట్రానికి వస్తే తమ దందా బయటపడుతుందని ప్రభుత్వ పెద్దలు భయపడుతున్నారని నిలదీశారు. నకిలీ మద్యం బయటపడగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారన్నారు. అసలు ఆ నకిలీ అన్నది ఒక ప్రాంతానికే పరిమితం అన్నట్లు నమ్మించేందుకు యత్నించారన్నారు. మరి ఇప్పుడు ఎందుకు రాష్ట్రవ్యాప్తంగా మద్యం నాణ్యత తనిఖీకి ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టారు? అంటే నకిలీ మద్యం రాష్ట్రమంతా విస్తరించిందని ఒప్పుకున్నట్లే కదా అని ప్రశ్నించారు. నిజంగా జోగి రమేష్ చెబితేనే జనార్దనరావు నకిలీ మద్యం తయారు చేస్తే.. తాను జయచంద్రారెడ్డికి చెందిన వాహనంలోనే ఆ మద్యాన్ని రవాణా చేశానని జయచంద్రారెడ్డి డ్రైవర్ చెప్పారు. మరి అక్కడ కూడా జోగి రమేష్ చెబితేనే ఆ రవాణా జరిగిందా? అని నిలదీశారు. వైఎస్సార్ సీపీ డిమాండ్ చేస్తున్నట్లు నకిలీ మద్యం కేసుపై సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని అన్ని వైన్‌షాప్‌లు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టు షాప్‌ల్లో తనిఖీలు ఎందుకు చేయడం లేదు? ఏది అసలు మద్యం? ఏది నకిలీ అనేది గుర్తించే ప్రయత్నం ఎందుకు చేయడం లేదని నిలదీశారు.

గల్లంతైన షారోన్ మృతదేహం లభ్యం

- ప్రకాశం జిల్లా కనపర్తి వద్ద గుర్తింపు
- షారోన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన కలెక్టర్, ఎస్పీ



షారోన్(ఫైల్)



షారోన్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్

చీరాల: వాడరేవు సముద్రతీరంలో గల్లంతైన షారోన్ మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి వచ్చిన ఐదుగురు విద్యార్థులు ఆదివారం గల్లంతైన ఘటన విదితమే. అదే రోజు రాత్రి ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం మరో విద్యార్థి మృతదేహం వాడరేవు తీరానికి వచ్చింది.

ముమ్మరంగా గాలింపు..

షారోన్ మృతదేహం కోసం అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. రెవెన్యూ, అగ్నిమాపక, మత్స్యశాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను కలెక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ ఏర్పాటు చేశారు. పది బోట్లు, ఆరు డ్రోన్ కెమెరాలు, పది మంది గజ ఈతగాళ్లు, పది మంది వీఆర్‌ఓలు వాడరేవు వద్ద ఉండి ఘటన ప్రాంతం నుంచి ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల పరిధిలో పరిశీలించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం గాలింపు చర్యలు చర్యలను కలెక్టర్ వి.వినోద్ కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ స్వయంగా పర్యవేక్షించారు. వేటపాలెం మండలం వడ్డెసంఘంలోని షారోన్ నివాసానికి కలెక్టర్, ఎస్పీ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతదేహాన్ని గుర్తించిన మత్స్యకారులు..

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమయ్య పట్టపుపాలెం గ్రామ సమీపంలో పట్టపుపాలేనికి చెందిన మత్స్యకారుడు రమేష్ బృందం మంగళవారం వేటకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో యువకుడి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. దీంతో రెవెన్యూ, పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు చేరుకొని మృతదేహం షారోన్‌దిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎస్పీ మొయిన్, రూరల్ సీఐ ఎం.శేషగిరిరావు, ఎస్ఐ ఎ.చంద్రశేఖర్ ఉన్నారు.

రైళ్లపై రాళ్లు విసిరిన అల్లరిమూకలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ చంద్రశేఖర్

చీరాల: వేగంగా వెళ్తున్న రైళ్లపై గులకరాళ్ల విసిరిన అల్లరి మూకలను మంగళవారం ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. ఈనెల 12వ తేదీన చీరాల ఆర్వోబీ సమీపంలో గూడ్స్ రైలు, విక్రమ్ సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుపై అల్లరిమూకలు రాళ్లు విసిరినట్లు చెప్పారు. రైలుపై రాళ్లు విసరడంతో కోచ్ అద్దాలు పగిలిపోయి ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పిందన్నారు. అయితే రైళ్లపై రాళ్లు విసిరే ముఠా కోసం ఆర్పీఎఫ్ ఏఎస్ఐ రమేష్‌బాబు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు బృందంగా ఏర్పడి గాలింపు చేపట్టారన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆర్వోబీ వద్ద రావూరి మణికంఠ, జగతా సాయి వంశీ, మానుపాటి శ్రీనుని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. ముగ్గురు నిందితులపై రైల్వే యాక్ట్ సెక్షన్ 153 కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా ఆకతాయిలు గానీ, చదువుకునే విద్యార్థులు గానీ ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిపై రైల్వే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో జీఆర్పీ ఎస్ఐ కొండయ్య, ఆర్పీఎఫ్ ఎస్ఐ మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అద్దేపల్లి మా'స్టార్లు'

- డీఎస్సీలో ఒకేసారి 11 మందికి ఉద్యోగాలు
- సత్తా చాటిన ఉపాధ్యాయులు

భట్టిప్రోలు: వారందరిది గ్రామీణ నేపథ్యమే.. మార్గనిర్దేశకులు కావాలనే కాంక్ష.. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు.. లక్ష్యంతో ముందుకు సాగారు.. అందుకు అనుగుణంగా కష్టపడ్డారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో విజయం సాధించారు. 11 మంది అద్దేపల్లి గ్రామానికి చెందిన వారే ఎంపికై ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.

వివరాలు.. ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష(డీఎస్సీ) ఫలితాలు విడుదల చేసింది. వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 65 విజయం సాధించారు. అందులో భట్టిప్రోలు మండలంలో 25 మంది ఎంపికై నట్లు అయ్యారు. కేవలం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో 11 మంది ఉపాధ్యాయులు ఎంపిక కావడం విశేషం. డీఎస్సీలో ఎంపికై న అభ్యర్థులకు హైస్కూళ్లల్లో వివిధ జిల్లాల్లోని సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. స్కూల్ అసిస్టెంట్లు 9 మందిలో ఇద్దరు హిందీ, నలుగురు బయోలజికల్, ఇద్దరు ఫిజికల్ ఎడ్యుకేషన్, ఒకరు సోషల్ స్టడీస్, 16 ఎస్‌జీటీలు ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు ఎంపికైన వారిలో అద్దేపల్లికి చెందిన యార్లగడ్డ శ్రీనివాస్, పమిడిపాముల ప్రవీణ్‌బాబు, కన్నేటి నాగమణి, ఆమంచి సాయికుమార్, పప్పుల జోతిర్మయి, ఆమంచి రమ్య, ఉప్పాల మానిక, కొతరపు కనకదుర్గ, వంగర హరీష్‌కుమార్, నందం యుగంధర ప్రసాద్, కాగితపు బీఎస్ సురేష్(అద్దేపల్లి), డి.గీతాదేవి, మద్దుల నాగ సురేష్, ఏసుపోగు ప్రసాదరావు, గాడల్లి హిమబిందు, ఆరేపల్లి నాగరాజు, నందం స్వాతి(భట్టిప్రోలు), దారం సుభాషిణి(పెదపులివర్రు), అద్దంకి శ్రీకృష్ణ(గొరిగపూడి), ఉప్పాల అఖిల మారుతి(వెల్లటూరు), లంకె బాలత్రిపుర సుందరి, విశ్వనాధపల్లి వాసంతి(ఓలేరు), నల్లూరి నాగజ్యోతి, పడమట శిరీష(కోనేటిపురం), చిల్కా సాంబశివరావు(పల్లెకోన) ఉన్నారు.

పర్యాటకరంగ అభివృద్ధికి కృషి

– జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

చినగంజాం: జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. ఇటీవల సముద్రంలో గల్లంతైన యువకుని మృతదేహం చినగంజాం సముద్ర తీరంలో కొట్టుకొని వచ్చిందన్న సమాచారంతో మంగళవారం చినగంజాం వచ్చారు.

సురక్షిత ప్రాంతంగా చేసేందుకు కృషి చేస్తాం..

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇటీవల సూర్యలంక బీచ్‌లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ వర్షాల కారణంగా వాయిదా వేశామన్నారు. ప్రతి వారాంతంలో ప్రతి బీచ్‌కు ఐదు వేల మందిపైగా పర్యాటకులు వస్తున్నట్లు చెప్పారు.

బీచ్‌ల్లో సురక్షిత చర్యలకు ఏర్పాట్లు..

జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో చీరాల వాడరేవు, సూర్యలంక బీచ్‌లకు రాష్ట్రంలోని స్థానిక పర్యాటకులతో పాటు తెలంగాణ నుంచి కూడా ఎక్కువ మంది వస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో తీరం వెంబడి బీచ్‌లలో పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా సురక్షిత చర్యలు తీసుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పర్యాటకులకు ప్రాణాపాయం జరగకుండా ఉండేందుకు అన్ని రకాలుగా ఉపకరణాలను భద్రతా చర్యలను తీసుకొని కలెక్టర్ సాయంతో ముందుకు వెళ్లనున్నట్లు వివరించారు.

మద్యం తాగి సముద్రంలో దిగితే కఠిన చర్యలు

బాపట్లటౌన్: మద్యం తాగి సముద్రంలో దిగితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. సముద్రతీరాలకు విహార యాత్రకు వచ్చే యాత్రికులు పోలీస్ శాఖ సూచనలు, హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

పర్యాటకులు లోతుకు వెళ్లకుండా చూడాలి



గజఈతగాళ్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ షలీమా

బాపట్ల: సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకులు లోతుకు వెళ్లకుండా గజ ఈతగాళ్లు పర్యవేక్షించాలని తహసీల్దార్ షలీమా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సముద్ర తీరంలోని గజ ఈతగాళ్లకు పలు సూచనలు ఇచ్చారు. నిత్యం మైకులలో లోతుకు వెళ్లొద్దంటూ సూచనలు చేయడంతో పాటు నడుము లోతుకు మించి పర్యాటకులను లోపలకు పంపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెప్పపాటులో జరిగే ప్రమాదాలను నియంత్రించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పర్యాటకుల భద్రతపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు. చీరాల వాడరేవు తీరంలో గల్లంతయిన యువకుడును సూర్యలంక పొగరు వైపు గుర్తిస్తే తక్షణమే అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. తహసీల్దార్ వెంట ఎంపీడీఓ బాబూరావు ఉన్నారు.

వ్యవసాయ రంగానికి అత్యధిక రుణాలు

- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
- లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయలేదని అసంతృప్తి
- కౌలు రైతులకు తప్పనిసరిగా రుణాలివ్వాలి
- జిల్లాను మూడో స్థానంలో నిలబెట్టాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల: వ్యవసాయ రంగానికి బ్యాంకర్లు అత్యధికంగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ కోరారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలో రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు కలిపి రూ.15,820 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగానికి రూ.12,080 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం రూ.3,472 కోట్లు మాత్రమే రుణాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అర్ధ సంవత్సరం గడిచినప్పటికీ కేవలం 28.74 శాతం పురోగతి సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక ప్రణాళికను బ్యాంకర్లు విస్మరించరాదన్నారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వకపోవడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఎనిమిది వేల మంది కౌలు రైతులకు రూ.వంద కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, కేవలం 2,326 మంది కౌలు రైతులకు రూ.8.80 కోట్లు రుణాలు మాత్రమే ఇచ్చినట్లు నివేదికలు చెబుతున్నాయని బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్లారు. బ్యాంకులకు వచ్చిన ప్రజలను బ్యాంకుల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్లో 15 రోజుల్లో ఏటీఎం ఏర్పాటు చేయాలన్నారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు విరివిగా రుణానివ్వాలని కలెక్టర్ కోరారు. ఆర్థిక సంవత్సరంలో రూ.1,291 కోట్ల రుణాలతో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం 37.15 శాతం మాత్రమే పురోగతి సాధించడంపై ప్రశ్నించారు. కేవలం రూ.479.75 కోట్లు రుణం ఇస్తే లక్ష్యాలు ఎప్పుడు చేరుకుంటారో బ్యాంకు అధికారులు పరిశీలించాలన్నారు. సమావేశంలో కమిటీ డెప్యూటీ కన్వీనర్ సోమేశ్వరరావు, ఎల్‌డీఎం శివకృష్ణ, ఆర్బీఐ ఎల్డీఓ గిరిధర్ పాల్గొన్నారు.

ఖనిజ సంపద నిధి సేకరణకు చర్యలు

బాపట్ల: ఖనిజ సంపద కింద చిన్న, పెద్ద గ్రానైట్ క్వారీలు, ఇసుక క్వారీల నుంచి చట్టబద్ధంగా సీనరేజ్ ద్వారా ఖనిజ సంపద నిధి సేకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో డీఎంఎఫ్(ఖనిజ సంపద నిధి) జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖనిజ సంపద నిధి చట్టబద్ధంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.51.22 కోట్ల నిధి ఉందని చెప్పారు. మార్చి నాటికి మరో రూ.నాలుగు కోట్లు సీనరేజ్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రూ.48.68 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ మైన్స్ డీడీ రామచంద్ర పాల్గొన్నారు.

స్వామిత్వపై దృష్టి పెట్టాలి..

గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమాల అమలుపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను కోరారు. కార్యక్రమంలో బాపట్ల మండలం వెనుకబడి ఉందని చెప్పారు. వందశాతం పూర్తి చేయాలని, వెబ్రోజేషన్‌ను రోజుకు 1000 చేయాలని లక్ష్యంగా నిర్దేశించి ఆ పనులపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓలకు సూచించారు. మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు ఒక ప్రణాళిక బద్ధంగా పనిచేసి జిల్లాను మూడో స్థానంలో నిలపాలని కోరారు. ఈ విషయమై మండల ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ లవన్న పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తే జిల్లా పురోగతి

బాపట్ల: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి బాపట్ల జిల్లా పురోగతి సాధిస్తుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో పంచాయతీ, మున్సిపాలిటీ విభాగాల పనులపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీలలో తడి, పొడి చెత్త సేకరణలో ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో వెనుకబడి ఉన్న పది పంచాయతీలకు కాషన్ నోటీసులు జారీ చేయాలని పంచాయతీ అధికారిని ఆదేశించారు. పంచాయతీలలో ఉన్నటువంటి అన్ని ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలని చెప్పారు. గడిచిన 15 రోజులలో ట్యాంకులను శుభ్రపరచని గ్రామాల నుంచి వివరణ కోరారు.

చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్ మృతి



బాపట్ల టౌన్: చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్ మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని అసోదివారిపాలెం గ్రామానికి చెందిన సర్వింగ్ సోల్జర్ అసోది గోపిరెడ్డి(35) సెప్టెంబర్‌లో సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. సెప్టెంబర్ 29న చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని సికింద్రాబాద్ మిలటరీ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి పంపించనున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపినట్లు రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. బుధవారం గోపిరెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	57,430
అమ్మకాలు	56,332
నిల్వ	13,955



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,200
నంబరు-5	10,000-14,200
273	10,500-14,000
341	10,000-15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,000
నంబరు-5	10,000-14,500
341	10,000-15,600
4884	10,000-14,000
సూపర్-10	10,500-14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,200
బాడిగ-355	10,500 - 15,800
దేవనూరు డీలక్స్	10,000 - 14,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	5,500 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,500-14,700
తాలు	5,300 - 8,000

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

నేటి నుంచి ఖోఖో పురుషుల జట్టుకు శిక్షణ

జే పంగులూరు: మండల పరిధిలోని ఎంఎస్ఆర్‌బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో నేటి నుంచి ఖోఖో పురుషుల జట్టుకు శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి 22వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టుకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న జట్టు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని ధావణగెరె పట్టణంలో నిర్వహించనున్న దక్షిణ భారత జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ క్యాంపునకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 15 మంది క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. జట్టుకు శిక్షణ ఇచ్చేందుకు జాతీయ సీనియర్ క్రీడాకారుడు, షేక్ ఆలీ నవాజ్ కోచ్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు వెస్ట్: ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్లు, దంతాలు, మధుమేహం, బీపీ తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా ఏపీ ఎస్‌పీఎఫ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్

ఏఎన్‌యూ (పెదకాకాని): క్రీడల ద్వారా దేహదారుఢ్యం, ఐకమత్యం పెంపొందుతాయని ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఏపీ ఎస్‌పీఎఫ్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఏఎన్‌యూలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. త్రివిక్రమ్ ఈ పోటీలను ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డితో కలసి ప్రారంభించారు. 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోటీలను నిర్వహిస్తున్నారు. డాక్టర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటముల తేడా లేదని, క్రీడా స్ఫూర్తి గొప్పదన్నారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్ జనరల్‌గా త్రివిక్రమ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఏపీ ఎస్పీఎఫ్‌లో మార్పులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల మినీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందన్నారు. సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులు, నూతన నియామకాలపై దృష్టి పెట్టారని చెప్పారు. ఈ క్రీడా పోటీలలో వాలీబాల్, బాడ్మింటన్, 100 మీటర్లు, 400 మీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పందేలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ యూనిట్ల నుంచి దాదాపు రెండు వందల మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విజయవాడ జోన్ కమాండెంట్ ముద్దాడ శంకర్రావు, కమాండెంట్ డీఎస్‌పీ బాషా, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వమే వైద్య కళాశాలలు నిర్వహించాలి


నినాదాలు చేస్తున్న సంఘాలు, పార్టీల నేతలు

గుంటూరు వెస్ట్: ఇప్పటికే పేదవాడికి అందనంత దూరంలో ఉన్న వైద్యాన్ని కూటమి ప్రభుత్వం మరింత దూరం చేస్తోందని దళిత బహుజన ప్రజా సంఘాలు, పార్టీల ఐక్యవేదిక ప్రతినిధులు ఆరోపించారు. ప్రభుత్వమే ఆయా కళాశాలలను నిర్వహించాలని పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వారు ఈ మేరకు డీఆర్వో తదితరుల సమక్షంలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... వైద్య కళాశాలలను పి.పి.పి. విధానంలో ఇతరులకు ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ సర్కారు పేదల కోసం 17 నూతన కళాశాలలను నిర్మించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. ఈ మేరకు పనులు ప్రారంభించగా, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఇతరులకు ప్రభుత్వ వైద్య కళాశాలలను కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా తీరు మార్చుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను వినిపిస్తూ నాయకులు, ప్రతినిధులు నినాదాలు చేశారు.

రైళ్లలో చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) అరెస్టు చేశారు. అతని వద్ద 64 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణ కథనం మేరకు.. సెప్టెంబర్ నెలలో రైళ్లలో బంగారు ఆభరణాలు కలిగిన లగేజీ బ్యాగుల చోరీలపై నమోదైన రెండు కేసులకు సంబంధించి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణలు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన మూల్పూరి ఫణీంద్ర కుమార్‌ను నిందితుడిగా గుర్తించారు. గతంలో రైళ్లు, స్టేషన్లలో ఇతడు నేరాలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చాడు. నిందితుడు మంగళవారం విజయవాడ కాశేశ్వరరావు మార్కెట్, శివాలయం వీధిలో ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.3.68 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో విద్యార్థుల సంఖ్య 40 కంటే తక్కువగా ఉన్న 46 ఎయిడెడ్ పాఠశాలలు మూతపడనున్న దృష్ట్యా ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగులు ఇవ్వాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.థామస్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల్లో పని చేస్తున్న 100 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలను కేటాయించి, సర్వీసుకు, వేతనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కొందరు ఉపాధ్యాయులు మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, హెల్త్‌కార్డులు ఇచ్చి, సెలవులను స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 214

కొమ్ములు : 152 బస్తాలు (ధర రూ॥ల్లో)		
కనిష్ట : 10,000	గరిష్ట : 10,850	మోడల్ : 10,825

కాయలు : 62 బస్తాలు		
కనిష్ట : 10,000	గరిష్ట : 10,825	మోడల్ : 10,825

మొత్తం అమ్మకాలు : 160.5 క్వింటాళ్లు

-దుగ్గిరాల

నేడు విద్యుత్ లోక్ అదాలత్

తాడికొండ: విజయవాడకు చెందిన కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం రాయపూడిలోని విద్యుత్ భవన్‌లో అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అమరావతి క్యాపిటల్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరగనుంది. సీఆర్‌డీఏ సర్కిల్, అమరావతి క్యాపిటల్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. విజయవాడ సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎన్ విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాంకేతిక సభ్యుడు డి. కృపానాయక్, ఆర్థిక సభ్యుడు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యులు సునీత, ఎస్ఈ ఎం. శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు

నెహ్రూనగర్: స్వయం ఉపాధి పథకాలపై ఎస్సీ యువతకు బుధవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో (జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్) అవగహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా అందించే స్వయం ఉపాధి పథకాలపై జిల్లాస్థాయిలో అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారని చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ యువత ఈ అవగాహన సదస్సుకు హాజరై ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు.

మొక్కజొన్న విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

నరసరావుపేట రూరల్: అధిక ధరకు మొక్కజొన్న విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు విత్తన స్టాక్ రిపోర్ట్‌ను అందజేయాలని తెలిపారు. రైతుకు ఇచ్చే బిల్లు మీద తప్పనిసరిగా లాట్ నెంబర్ వేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేయాలని, విత్తన చట్టానికి లోబడి ప్రతి డీలరు వ్యాపారం చేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఏఓ శాంతి, డీలర్లు పాల్గొన్నారు.

నేడు అబ్దుల్ కలాంకు నివాళి

నరసరావుపేట: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని బుధవారం ఉదయం 10 గంటలకు పల్నాడు రోడ్డులోని విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఉదయం 9:30 గంటలకు గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

మొబైల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి ఫోన్లను తిరిగి అప్పగించారు. సుమారు రూ.50 లక్షల విలువైన 250 ఫోన్లను మంగళవారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో బాధితులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఫోన్లను పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేస్తే సమాచారం దుర్వినియోగం కాదని అన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.6.82 కోట్ల విలువైన 3,414 ఫోన్లను బాధితులకు అప్పగించామని చెప్పారు. హెల్ప్ నంబర్ 86888 31574 లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఐటీ కోర్ సీఐ నిషార్ బాషా, హెచ్‌సీ కిషోర్, కానిస్టేబుళ్లు శ్రీధర్, ఇమామ్‌సాహెబ్, యాసిన్, అరుణ, మానస, సీసీఎస్ హెచ్‌సీ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాలను జిల్లా ఎస్పీ అభినందించారు.

జీవన ఎరువులే పంటకు జీవం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్

యడ్లపాడు: ప్రతి పంటకు జీవం జీవన ఎరువులేనని పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్ అన్నారు. జీవన ఎరువుల ప్రాముఖ్యతపై జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా మంగళవారం యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యగోపాల్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. నగేష్ మాట్లాడుతూ జీవన ఎరువుల వినియోగం వల్ల దాదాపుగా 25 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఇవి భూసారాన్ని పెంపొందించి, పంటలో జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో సహాయపడతాయని అన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని, నాణ్యతతో కూడిన దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యగోపాల్ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా తయారయ్యే జీవన ఎరువులు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని వివరించారు. గాలిలోని నత్రజనిని స్థిరీకరించి పంటకు అందుబాటులోకి తేవడం, భూమిలో అందుబాటులో లేని భాస్వరం, పొటాష్ పోషకాలను మొక్కకు అందుబాటులోకి తేవడం, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో జీవన ఎరువులు ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి హేమలతాదేవి, అభ్యుదయ రైతు పోపూరి శివరామకృష్ణ, జగ్గాపురం, యడ్లపాడు గ్రామాల్లోని విద్యార్థినులు పి గాయత్రి, ఎ జేబీవిజయశ్రీ, సీహెచ్ కీర్తిశ్రీనిధి, జ్యోత్స్న, ఎ జోషిత శ్రేయ, చాందిని, భాగ్యశ్రీ, ఎం జ్యోత్స్న, డి భువనేశ్వరీ, ఎన్ హర్షిత, కె హర్షిత, ఎండీ హమిద పాల్గొన్నారు.

సాగులో సాంకేతికతపై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మి

రేపల్లె: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటంపై పట్టుసాధించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి అన్నారు. సాగులో సాంకేతికత వినియోగంపై వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో మండలంలోని పేటేరు వ్యవసాయ సహాయ కేంద్రంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న మార్పులకు అనుగుణంగా యంత్ర పరికరాలు వస్తున్నాయని, వీటితో సమయం, డబ్బులు ఆదా అవుతాయని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే మినీ రైస్ మిల్, అపరాల పంటల విధానాలు, వివిధ రకాల నూనె గింజల నుంచి నూనె తయారు చేసే విధానాలను వివరించారు. డాక్టర్ వాసుదేవ మాట్లాడుతూ సోలార్ డ్రైయర్ పనితీరు, దీని ఉపయోగంతో పాటు పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ద్వారా రైతులు పంటకు విలువ జోడించి అధిక ఆదాయం పొందే మార్గాలను సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్, ఏఓ మహేష్‌బాబు, వీఏఏ రాయల్‌బాబు, రైతులు, బాపట్ల పోస్ట్ హార్వెస్టర్ రీసెర్చ్ సెంటర్ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

25న తెనాలిలో ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల సభ


ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న రైతులు

తెనాలి: పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల తరహాలో లీటరుకు రూ.8-10 ప్రోత్సాహకధర ఇవ్వాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన తెనాలిలో సభ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. తెనాలిలో మంగళవారం పాడిరైతులతో కలసి మహాసభ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెనాలి అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కల్యాణమండపంలో 25న ఉదయం 10 గంటలకు మహాసభ జరుగుతుందని తెలిపారు. గేదెపాలు లీటరుకు రూ.40, ఆవు పాలు రూ.20కు మించి డెయిరీల్లో ధర రావటం లేదన్నారు. పాడి పశువులకు బీమా మార్కెట్ ధర ప్రకారం నిర్ణయించాలని తెలిపారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని సంఘం జిల్లా నాయకురాలు వేజెండ్ల తబిత కోరారు. తెనాలి శాంతకుమారి, మాన్యం పద్మ, ఎల్లమాటి మేరమ్మ, కె.శకుంతల ఎ.సరోజిని, టి.నిర్మల, సంతోషం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం


రోషన్‌ను అభినందిస్తున్న డి.శ్రీనివాసరావు, జీవీఎస్ ప్రసాద్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఒడిశాలో ఈ నెల 10 నుంచి 14 వ తేదీ వరకు జరిగిన 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన ఎస్కే రోషన్ రజత పతకం సాధించాడు. అండర్ 20 యూత్ విభాగంలో 110 మీటర్ల హర్డల్స్‌లో ఈ పతకాన్ని సాధించాడని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోషన్‌ను ఏపీ రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అభినందించారన్నారు. స్టేడియంలో అథ్లెటిక్స్ ట్రాక్ కూడా బాగు చేయాలని కోరారు. సదుపాయాలు కల్పిస్తే మరింత మంది రాణిస్తారని ఆకాంక్షించారు. రోషన్‌ను కోచ్ రామకృష్ణ, కె.రవి, కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, ఎస్కే మన్సూర్ వలి తదితరులు అభినందించారు.

ఈత పోటీలలో రైల్వే ఉద్యోగి ప్రతిభ


గంపల సాంబశివరావును అభినందిస్తున్న డీఆర్ఎం సుథేష్ఠసేన్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజనులో లోకో పైలట్ (గూడ్స్) గంపల సాంబశివరావు ఈత పోటీలలో ప్రతిభ చాటారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ఈత పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన ద్వారా సంస్థకు కీర్తి తెచ్చిపెట్టారని గుంటూరు డీఆర్ఎం సుథేష్ఠసేన్ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం సాంబశివరావును ఘనంగా సత్కరించారు. డీఆర్ఎం మాట్లాడుతూ ఈ నెల 11, 12వ తేదీల్లో మంగళగిరిలో ఎస్.మహబూబ్ షంషేర్ ఖాన్ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో సాంబశివరావు 2 బంగారు, వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకోవడం అభినందనీయం అన్నారు. ఈ నెల 8వ తేదీన గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 8వ అంతర్ జిల్లాల మాస్టర్ స్విమ్మింగ్ పోటీలలో సైతం 4 బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. ఏడీఆర్ఎం ఎం.రమేష్‌కుమార్, అధికారులు అభినందించారు.

పట్టపగలే వ్యక్తి దారుణ హత్య

- కొబ్బరిబొండాల కత్తితో నరికి చంపిన దుండగుడు
- పాత కక్షలు, కుటుంబ కలహాలే కారణమని సమాచారం


ఘటనాస్థలంలో బుజ్జి మృతదేహం

తెనాలి రూరల్: గుంటూరు జిల్లా తెనాలిలో పట్టపగలు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. టిఫిన్ బండి వద్ద ఉన్న వ్యక్తిపై కొబ్బరి బొండాల కత్తితో దాడి చేసి దుండగుడు హతమార్చాడు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి (60) గ్రామంలోని తమ సామాజిక వర్గంలో పెద్దగా ఉన్నాడు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె గండికోట దుర్గ తెనాలి చెంచుపేటలోని ఎమ్మెల్యే బజారులో ఉంటోంది. బుజ్జి పది రోజుల క్రితం కుమార్తె వద్దకు వచ్చాడు. బైక్‌పై టిఫిన్ బండి వద్దకు మంగళవారం ఉదయం వెళ్లాడు దోశలు ఆర్డరిచ్చి వేరే వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అంతలోనే ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కొబ్బరి బొండాలు నరికే కత్తితో తిరుపతిరావుపై దాడి చేసి అత్యంత పాశవికంగా హత్య చేశాడు. నిందితుడు ముఖానికి మాస్క్ వేసుకుని ఉన్నాడని, హత్యానంతరం తన వాహనంపై వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న డీఎస్పీ బి. జనార్దనరావు, త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు, ఎస్ఐ కరిముల్లా తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారణమేంటి?

పాత కక్షలు, ఆధిపత్య పోరు కారణంగానే ఈ హత్య జరిగినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కోరుతాడిపర్రు గ్రామంలో ఆలయానికి సంబంధించిన నగదు పాట నిర్వహించడం, ఆలయ వ్యవహారాల పర్యవేక్షణ వంటివి బుజ్జి చూస్తుంటాడు. అమృతలూరు సొసైటీ సభ్యుడిగా కూడా ఉన్నాడు. ఆలయ వ్యవహారం ఏళ్లుగా ఒక్కరే చూడాలా అంటూ గ్రామానికే చెందిన అల్లుడు వరుస అయ్యే వ్యక్తి ఇటీవల బుజ్జితో వాగ్వాదానికి దిగాడని, అలాగే తన తండ్రి మృతికి తిరుపతిరావు కారణమంటూ గతంలో ఘర్షణ పడ్డాడని తెలుస్తోంది. అతనే ఈ హత్య చేసి ఉంటాడని అటు గ్రామస్తులు కూడా భావిస్తున్నారు. మరో వైపు తిరుపతిరావు మనవరాలికి ఆమె భర్తకు మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. మూడు రోజులుగా తెనాలి చెంచుపేటలో ఈ పంచాయితీ వ్యవహారం నడుస్తోంది. కుటుంబ కలహాలకు తిరుపతిరావే కారణమని, అతడిని హతమారిస్తే కలహాలు ఉండవంటూ మనవరాలి భర్త సోమవారం రాత్రి హెచ్చరించాడని చెబుతున్నారు. గ్రామంలో ఆధిపత్య పోరులో అల్లుడి వరుస అయ్యే వ్యక్తి లేదా మనవరాలి భర్త ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. వారిద్దరూ ఒక్కటై హత్య చేసి ఉంటారనే కోణంలోనూ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


తిరుపతిరావు అలియాస్ బుజ్జి (ఫైల్)

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా పెదకాకాని మండలంలో 15.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 0.8 మి.మీ. పడింది. సగటు 6.3 మి.మీ.గా నమోదైంది. కొల్లిపర మండలంలో 14.2 మి.మీ., మంగళగిరి 13, తాడేపల్లి 10.2, పొన్నూరు 9.8, కాకుమాను 8.4, తుళ్ళూరు 4.2, ప్రత్తిపాడు 3.8, తాడికొండ 3.8, చేబ్రోలు 3, గుంటూరు పశ్చిమ 2.2, ఫిరంగిపురం 1.8, వట్టిచెరుకూరు 1.4, గుంటూరు తూర్పులో 1.2 మి.మీ. చొప్పున వర్షపాతనం పడింది. అక్టోబర్ 14వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 58.4 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 77.9 మి.మీ. వర్షపాతం పడింది.